

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 28 పుష్పం :34 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11–4–99, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరాన్ని మనస్సు నడిపిస్తోంది. అసూయ, స్వార్థం, ఉద్రేకం, కామం, ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సులో వచ్చే ప్రతీతలంపుయొక్క ప్రభావం శరీరంమీద ఉంటుంది. మనస్సు ఎటు నడిపిస్తే శరీరం అటు నడుస్తుంది. మనస్సు శరీరం లేకుండా ఉండలేదు కాబట్టి మనస్సు ఎంతకాలం అయితే ఉంటుందో అంతకాలం పునర్జన్మ ఉంటుంది. మన మనస్సులో ఎంతకాలం అయితే దోషాలు ఉంటాయో, మన మనస్సులో ఎంతకాలం అయితే ఆకారముల మీద ఆకర్షణ ఉంటుందో, మన మనస్సులో ఎంతకాలం అయితే వికారములు ఉంటాయో అంతకాలం మనకు పునర్జన్మ వస్తుంది. భౌతికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని అభివృద్ధిలోనికి రావాలంటే మనో నిగ్రహం అత్యంత ముఖ్యం. మనస్సుకునిగ్రహం లేకపోతే దానికి అంతర్దృష్టి కలుగదు. దానికి అంతర్దృష్టి కలుగకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. సత్పురుషులతో సహవాసం చేస్తే సద్వాసనలు వస్తాయి, దుష్టులతో సహవాసం చేస్తే దుర్వాసనలు వస్తాయి. మనలను నియమించే వాడు మన హృదయంలో ఉన్నప్పటికి మనకు తెలియకపోవటానికి కారణం మనమనస్సు. మనకు విషయ సుఖాలు ఎలా ఉంటాయో తెలుసుగాని నిర్వాణ సుఖం ఎలా ఉంటుందో మనకు తెలియదు. నిర్వాణ సుఖం మన హృదయంలో ఉన్నప్పటికి మనకు అందకపోవటానికి ఎవరో ఇతరులు కారణం కాదు, సమాజం కారణం కాదు, మన మనస్సులో ఉన్న దోషములే కారణం. మనస్సులో ఉన్న దోషములను పోగొట్టు కోవటానికి ట్రైనింగ్ పొందటానికి మనం ఈ భూమికి వచ్చాము. ఒకో మనస్సులో ఒకో దోషం ఉండవచ్చు. అది తెలుసుకొని వివేకముతో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనం విశాఖపట్నం వెళుతున్నాము అనుకోండి కారు మారతాము, రైలు మారతాము, దారిలో ఎవరైనా కనిపిస్తే వారితో మాట్లాడతాము కాని విశాఖపట్నం వెళ్లటం అనే గమ్యం మర్చిపోము అలాగే మనం ఎక్కడ ఉన్నా, ఏ వృత్తిలో ఉన్నా నిర్వాణ సుఖం పొందటం అనే గమ్యం మనం మర్చిపోకూడదు. ఏది అయితే గమ్యమో, ఏదైతే గతో ఆగతి మీద మన మతిని పెట్టుకొని పనిచేస్తే వస్తువు మనకు ఈ జన్మలోనే దొరుకుతుంది.

మన మనస్సులో ఉన్న దోషములను తొలగించుకోవటమే సాధన యొక్క ప్రయోజనం. అందుకు భక్తి, జ్ఞానం, వైరాగ్యం కావాలి, మహర్షులతోటి మహాత్ముల తోటి సన్నిహితమైన అనుబంధం కావాలి. ఇవి అన్నీ సమకూరితేనే గాని మన మనస్సులో ఉన్న దోషములు బయటకు

పోవు. మనస్సులో ఉన్న దోషములు పూర్తిగా నశిస్తేనే గాని ఈ జన్మలోనే కాదు వెయ్యి జన్మల తరువాత కూడా వస్తువు మీకు దొరకదు. మనకు ఉన్న తెలివిని, వివేకాన్ని మోక్ష స్థితిని పొందటం కోసం ఉపయోగించుకోవాలి, అలాచేత కాకపోతే నేర్చుకోవాలి. భౌతికంగా ఎన్ని ఉన్నా అవినయం రాకుండా చూసుకోవాలి. అవినయం వస్తే పతనమవుతారు. ఆత్మ అంటే భగవంతుని స్వరూపమే. భగవంతుని దయను పొందలేకపోతే, భగవంతునికి ఇష్టులు కాకపోతే భగవంతుడు మన హృదయంలో అత్యంత సమీపముగా ఉన్నప్పటికి ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వడు. భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే మన ఇంద్రియాలను జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోవాలి. కాలాన్ని పాడుచేసుకోకూడదు. ముసలితనం, రోగం, చావు ఇవి మూడు జ్ఞాపకం పెట్టుకొంటే వర్తమాన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి అనేబుద్ధి కలుగుతుంది. మనం పనిచేస్తే అది ఇహానికి, పరానికి ఉపయోగపడాలి. అప్పుడు ఆపనివలన మనకు సంతృప్తి, శాంతి ప్రాప్తిస్తుంది. మనం ఏమతంలో ఉన్నా మనకు పూర్తిగా స్వార్థం లేకపోతే మోక్షం దగ్గరకు మనం వెళ్లనక్కరలేదు, మోక్షమే వచ్చి మనలను వరిస్తుంది. అంత నిస్వార్థస్థితి మనకు లేదు. నిజంగా ఆస్థితి మనకు వస్తే మోక్షం వచ్చేస్తుంది. అయితే మనం చేయవలసింది ఏమిటి అంటే మనకు చేతనయినంతవరకు స్వార్థం తగ్గించుకోవాలి. మనం పెద్దపెద్ద పనులు చేయనక్కరలేదు. మనం చేసేది చిన్నపని అయినా స్వార్థం లేకుండా చేస్తే ఎంతో సౌందర్యవంతంగా ఉంటుంది. మోక్షస్థితి పొందటానికి అది నీకు సహకరిస్తుంది.

కృషి చేయని మనిషి ఋషి అవ్వలేడు. మనమనస్సు పరిశుద్ధం అవ్వటానికి కృషి చేయాలి. పుణ్యం, పాపం సంపాదించేది మనస్సే. నీ మనస్సు నీ స్వాధీనంలో ఉంటే ఇతరులు నీకు దుఃఖం తీసుకుని రావాలన్నా తీసుకొని రాలేరు. నీ మనస్సు స్వాధీనంలో లేకపోతే ఎవరూ నిన్ను సుఖపెట్టలేరు. ఈ రహస్యం అంతా మనస్సులో ఉంది. అందుచేత ఎప్పటికప్పుడు నీమనస్సును సమానంగా ఉండేలా చూసుకోవాలి. మనఆలోచనా విధానం, మన పోకడ ఏరోజుకారోజు ఎలా ఉందో జరుగుతుందో చూసుకోవాలి. నీ శరీరాన్ని, నీ ఇంటిని ఎలా చూసుకొంటున్నావో అలాగే నీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోవాలి. ఇతరులు ఆనందంగా సంతోషంగా శాంతిగా ఉంటే కొంతమంది ముఖం చిన్నగా అయిపోతుంది, దుఃఖం వస్తుంది. అసూయవలన ఇలా జరుగుతుంది. మానసికఆరోగ్యం సరిగా లేకపోతే ఇటువంటి బలహీనతలు కలుగుతాయి, వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీవు పని చెయ్యకుండా మరణించటం కంటే పనిచేస్తూ మరణించటం మంచిది. నీ పోషణకు సంబంధించినంత వరకు నీవు ఇతరుల మీద ఆధారపడవద్దు. మనకు ఉదయం మొదలు సాయంత్రం వరకు ఇష్టాలను సంపాదించుకోవటం, అయిష్టాలను గెంటి వేయటం ఇవి రెండే పనులు. ఇష్టం, అయిష్టం రెండూ మనస్సులోనే ఉన్నాయి. కొంతమంది ప్రేమిస్తే అతిగా ప్రేమిస్తారు, లేకపోతే అతిగా ద్వేషిస్తారు. ఇవి రెండూ ప్రమాదమే. మనలో రాగద్వేషములు ఉన్నా వాటిని గమనించకుండా ఉంటే అవి ఎండిపోయి రాలిపోతాయి. మనస్సును పొంగకుండా

చూసుకోవాలి, వ్యవహారంలో దానిని కలుగజేసుకో నివ్వవద్దు. మీకు ఇష్టం లేని వారితో ఒక్కోసారి మాట్లాడుతూ ఉండండి. మనస్సు చేయవద్దన్న పనులు చేస్తూ ఉంటే మనస్సులో ఉన్న దోషములు పోతూ ఉంటాయి. అవమానములు భరించలేకపోతే మీకు ఆత్మజ్ఞానం కలుగదు.

మనం చదువుతున్నాము, శ్రవణం చేస్తున్నాము, కళ్ళతో చూస్తున్నాము. ఎంతోజ్ఞానాన్ని సంపాదించుకొంటున్నాము. ఈ సంపాదించుకొన్న జ్ఞానం కేవలం నీబుద్ధికే పరిమితం. నీవు శ్రవణం చేసిన మంచిని, నీవు నోటితో మాట్లాడుతున్న మంచిని అర్థం చేసుకొని ఎంతోకొంత ప్రాక్టీస్ చేస్తే అది నీహృదయంలోనికి దిగుతుంది. నీకు అనుభవంలోనికి వస్తుంది. ఈఅనుభవం నీకు ఆత్మజ్ఞానాన్ని సంపాదించిపెడుతుంది. అప్పుడు హృదయంలో ఉన్న ఆనందం నీకు తెలుస్తుంది. మనం ప్రాక్టీసు చేయకపోతే విని ఊరుకుంటే అది మనబుద్ధికే పరిమితంకాని మన హృదయంలో ఉన్న సుఖం, శాంతి మనకు అందదు. కుండ మట్టే కాని మట్టి కుండకాదు, పాము తాడే కాని తాడు పాముకాదు, జగత్తు అంతా ఈశ్వరుడే కాని ఈశ్వరుడు జగత్తుకాదు. ఆచార్యులు వారు అద్వైత సిద్ధాంతంలో ఈ విషయాలు చెపుతారు. ఇవి బాగా గుర్తుపెట్టుకోండి. అద్వైతానుభవం కలగటానికి ఈ మాటలు ఉపయోగపడతాయి. అద్వైతానుభవం రాకుండా అద్వైత సుఖం మనం పొందలేము. బాహ్యమైన వస్తువుల తోటి, వ్యక్తులతోటి సంబంధం లేకుండా స్వతంత్రమైన సుఖం, శాంతి మనకు అందుతూ ఉంటే అది అద్వైత సుఖం. మానవుడు ఏపని చేసినా ఆనందం వస్తుందని చేస్తాడు. కాని ఆనందం ఎక్కడ ఉందో వాడికి తెలియదు. ఆనందం భగవంతునిలో ఉంది. అందుచేత ఆయనను తెలుసుకొంటే మనం ఆనందం పొందుతాము దానికి వివేకం అవసరం.

మనం ఏ ఆశ్రమంలో ఉన్నా మనం గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నా మన మనస్సుకు యోగ్యత వస్తే మోక్షం వస్తుంది. ఆశ్రమానికి, మోక్షానికి సంబంధం లేదు. యోగ్యత, అర్హత ముఖ్యం. దేహం ఎక్కడ ఉన్నది అనేది ప్రధానం కాదు, మనస్సు ఎక్కడ ఉంది అనేది ప్రధానం. దేహం ఎక్కడ ఉన్నా మనస్సుతో భగవంతుని ధ్యానిస్తూ ఉంటే అది యోగం అవుతుంది. ఏదో మార్గంలో మనం తరించాలి. మీరు చేసేది సిన్సియర్‌గా చేయండి. భగవంతుడు అల్ప సంతోషి. ఆయన అనుగ్రహానికి పాత్రులయితే ఆయన స్వరూపం మనకు ఇస్తాడు. అదే శాంతి, అదే నిర్వాణం, అదే మోక్షం. మనం ఏది పొందాలో దాని గురించి ఒక అవగాహన మనకు ఉండాలి. మీరు సమాజం కోసం పనిచేసినా, కుటుంబం కోసం పనిచేసినా మీరు ఎలా పనిచేసినా మీరు పొందవలసిన గమ్యం మాత్రం దృష్టిలో నుండి మరలకూడదు. దానికి సంబంధించిన స్మృతి విడిచి పెట్టకూడదు. స్మృతి పోతే ఇంక మనకు మృతేగతి. నా శరీరానికి మరణం రాకూడదు అని కోరుకోకూడదు. శరీరానికి ఏదోరోజు మరణం వస్తుంది. చావు వచ్చేరోజు రాకముందే చావు అంటే ఏమిటో మనకు తెలియాలి, చావులో నుండి విడిపోవాలి అప్పుడు పునర్జన్మ ఉండదు. నా శరీరానికి మరణం రాకముందే మరణ రహస్యం

విప్పిచెప్ప అని భగవంతుని ప్రార్థించాలి. అదే ప్రార్థన. ఏ శక్తి అయితే ఈ సృష్టిని నడుపుతోందో ఆ శక్తికి ఈ దేహాలు ఎక్కడ ఉండాలో, ఎలా ఉండాలో, ఏపనిచేయాలో, ఏ అనుభవాలు పొందాలో నీకంటే నాకంటే ఆశక్తికి ఎక్కువ తెలుసు. యావత్ సృష్టిని నడిపే శక్తి ఉంది. ఆ ఉచ్చరశక్తిని నమ్మాలి. దానిమీద గాఢమైన విశ్వాసం ఉండాలి. శ్వాసపోయినా భగవంతుడి మీద విశ్వాసం పోకూడదు.

ఒక భక్తురాలు భగవాన్‌తో చెపుతున్నారు క్రిందటిసారి నేను మీ ఆశ్రమానికి వచ్చాను కాని నా భర్త తోటి, పిల్లలతోటి వచ్చాను. వారిని సవరించటంతోనే సరిపోయింది. మిమ్మలను మిస్ అయిపోయాను. ఇక్కడకు ఎందుకువచ్చానో వచ్చిన పని మర్చిపోయాను అని ఇంటికి వెళ్ళిన తరువాత చింతించాను. ఒకరోజు మా ఆయన ఏమన్నారు అంటే నాకు రెండురోజులు సెలవు ఉంది వెళ్ళాలంటే నీవు వెళ్ళి భగవాన్‌ను చూసిరా అన్నారు. అప్పుడు నాకు ఆశ్చర్యం కలిగింది, ఆనందం కలిగింది. కాని ఇప్పుడు మిమ్మలను చూసాక ఆ మాటలు మా ఆయన అనలేదు, మీరే నన్ను ఆహ్వానించారు అని తెలుస్తోంది. ఇక్కడకు వచ్చే వరకు మా ఆయనే నన్ను పంపించారు అనుకొన్నాను కాని మిమ్మలను చూసాక మీరే నన్ను తీసుకొని వచ్చారు అని, చేసేది అంతా మీరే అని తెలుస్తోంది. మీ సన్నిధిలో నిర్మలంగా గడపాలని వచ్చాను. మిమ్మలను గ్రహించే శక్తి నాకు లేదు, ఆ శక్తిని మీరే అనుగ్రహించాలి. మీరు చెప్పినట్లు మోక్షం వస్తే సరేసరి కాని నాకు ఇప్పడే మోక్షం వద్దు, నాకు భక్తి చాలు అనిపిస్తోంది. నామనస్సులో జరిగే ఘర్షణ చెపుతున్నాను. మీ పట్ల నాకు ఉన్న భక్తిగాని, విశ్వాసం గాని చెదిరిపోకుండా చూడండి, అది అభివృద్ధి అయ్యేలా చూడండి అని భగవాన్‌ను అడుగుతోంది. ఇలా అడగటానికి నా అహంకారం సరిపోతుందా. బహుశా నాలోభక్తి అభివృద్ధి అవ్వాలని మీరు అనుగ్రహిస్తున్నారు కాబట్టి నాకు ఈ వాంఛ కలుగుతోంది గాని మీ అనుగ్రహం లేకపోతే ఈ వాంఛ కూడా నాకు కలగదేమో అంటున్నారు. ఎంత సహజంగా, నిర్మలంగా చెపుతోందో చూడండి. మాట మాటకు మిమ్మల్ని వేధించను, సంభాషణ పొడిగించను. సంభాషణ ముఖ్యం కాదు కావలసినది మీదయ అని అడుగుతోంది. సందేహించేవాడు ఉన్నంత సేపు సందేహాలు వస్తూ ఉంటాయి. మిమ్మల్ని సందేహాలు అడిగి అడిగి సందేహించే వాడిని పొడిగించుకొనే బదులు ఇవి అన్నీ ఆపుచేసి మీ అనుగ్రహానికి పాత్రురాలను అవ్వటం మంచిది. ఇవి అన్నీ ఆపి మీ అనుగ్రహానికి పాత్రురాలను అవ్వాలని అనుకోవటం కూడా మీ అనుగ్రహం వలననే కలుగుతోందేమో అని చెపుతోంది. మనం చేస్తున్న పని నిర్మలంగా, నిశ్శబ్ధంగా చేసుకొంటూ పోవాలి అప్పడు మనలను చూసి భగవంతుడు సంతోషిస్తాడు. ఎప్పడైతే భగవంతుడు సంతోషించాడో ఆయన అనుగ్రహాన్ని మనకు ఇస్తాడు.

జిన్నూరులో సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనము ది. 4-7-99

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL ☎ 24776